# బ్రతుకుబాట

★

శ్రీ ఘట్టి కృష్ణమూర్తి

"ఏరా రామూ, మామయ్య ఏమని రాశాడురా ఉత్తరం?"

"ఏముందమ్మా, అయన్ని ఎప్పుడూ వొకటే గొడవ."

"అలా విసుక్కుంటే యెలాగురా మరి? అయినా వొహసారి చదువు, ఏం రాశాడో వింటాను!"

"ఎన్ని సార్లు రాసినా ఆ పద్మనాభం గారిసోదే—పోనీ, ఆడపిల్లగలవాడు ఆయన తొందరపడుతున్నాడన్నా అర్థం వుంది. మధ్య ఈయనకెందుకు మాటిమాటికీ మనల్ని ఇంతపొడుగున గూటిస్తూ రాయడం?"

"అవున్రా మరి—మనకూ అంతకంటె పెద్దదిక్కెవరూ లేరు కనక వాణ్ణే అడిగివుంటాడు."

"అడిగితే 'ప్రసంగతి నాకు తెలీద'ని చెప్పెయ్యకూడదూ? మధ్య మన ప్రాణాలు తీయకపోతే—"

"అవేం మాటల్రా, వాడు చెప్పినా మనమంచికోసమేగా!"

"ఇంకా యేం, తమ్ముణ్ణి యేమన్నా అంటే వెనకేసుకొస్తావ్? మనమంచికోసమే వీళ్లంతా పాటుపడి బద్ధలైపోతున్నారు."

"అదేమన్న మాటరా, మీ నాన్నే వుంటే ఇలా కసురుకునేవారా?"

"రేపు నేనూ రాస్తాను. ఇకమీద మనకే ఉత్తరాలు రాయించవొద్దని"

"అదేం మర్యాదగా వుంటుందిరా, పరాయి పెద్దమనిషికి సమాధానం రాసేతీరు అదేనా? ఎవర్నో విదిలించి కొట్టినట్టు? సాయిలా పాయిలాగా అన్నీ మాట్లాడుకోవాలిగానీ..."

"అయితే మామయ్యకే రాసేస్తాను."

"ఆయనకు రాస్తే వొహటీ, మామయ్యకు రాస్తే వొహటీనా? ఎందుకొచ్చింది. మామయ్యదగ్గరే పెళ్లీడొచ్చిన పిల్లవుంటేనా, మనం యీ పరాయియిల్లు పాకులాడాల్సిన అవసరమే వుండకపోను. అయినా పద్మనాభంగారు మనకు పరాయివాడా?

ఇప్పుడైతే అక్కడకు వెళ్లిపోయినారు కానీ, యీవూళ్లో వుండగా మీ నాన్నతో సలహా చెయ్యందే ఏపనీ చేసేవాడే కాదు. చివరికి పండగా పబ్బం వచ్చినా బజార్నించి యిద్దరూ వొక్కటేరకం సరంజాం కొనుక్కొచ్చేవారు. చిత్రంగా వుండేది! వాళ్లు ఆవూరు వెళ్లిపోయినా పిల్లల పెళ్లిళ్లప్పుడు అచ్చంగా మీ నాన్నే అన్నీ బుజానవేసుకు చేసినట్టు చేశారు. ఆఖరికి ఆయనచేత చేతులో చేయి వేయించుకుని మరీ వెళ్లిపోయినారు.

ఆ విశ్వాసంచేతనే ఇప్పుడు ఆయన మనల్ని పట్టుకు దేవుళ్లాడడం.

ఎప్పటికైనా మనవంశంలో వొక పిల్లనివ్వాలని సంబరాలు పడుతూవుండేవాడు. మీ నాన్నని చూసినప్పుడల్లా...ఇప్పుడు కట్టెవిరిచి పోయిలో పెట్టినట్టు ఉత్తరాలు రాస్తే మనపరువు యేమైనా వుంటుందా, లోకులు ఏమంటారు?"

"ఏమిటట నేది?—అసలు మనకు 'వొద్దో మొర్రో' అంటుంటే మెడమీదకు తీసుకువచ్చి ఈ బలవంతం యెందుకంట? నాన్న వున్నప్పుడు ఏదో మాటవరసకు అనుకున్నారే అనుకో, ఇప్పుడుకూడా దానినే పట్టుకు పాకులాడ్డానికి మనం ఆయన్ని నిర్బంధించడం లేదుగా, అంత గండకత్తెర యేమొచ్చింది?"

"వొచ్చిందేదో వొచ్చింది. రానిదిరాదు, మన కుటుంబంమీద ఆయనకున్న విశ్వాసం అటువంటిది. ఆమనిషి కాస్తా దాటిపోగానే మొహం తప్పించాడని అందరూ అనిపోతారని ఆయనకు భయం"

"భయం?—లోకానికి భయపడి మనల్ని ఉద్ధరిస్తాడు. నాకసలు ఇష్టంలేదు మామయ్యకు ఇప్పుడే వుత్తరం రాసేస్తాను"

"ఉండరా అబ్బాయీ! అన్నీ మనం అనుకున్నట్టు జరగవు. ఎక్కడో ముక్కూ మొహం తెలియని పరాయిచోటుకుపోతే వాళ్లకీ మనకీ పొత్తు కుదరకపోవడం, వాళ్లొకటి అనడం, మనమొకటి అనుకోవడం, దిబ్బా—దిశిబండలూ—యెన్ని వుంటాయి!

పద్మనాభంగారంటావా మొదణ్ణించీ మనకి చేలోకునైనవాడు, ఆవిడ, పిల్లలుకూడా కుదురైన వాళ్లు, సంసారం పొందికైనది. పెద్దపిల్లలిద్దరూ కాపరాలు చేసుకుంటున్నారు చూడు! ఒక్కరవ్వంతైనా మాటా, పలుకూ లేకుండా.

వాళ్లు యిక్కణ్ణించి వెళ్లి పదేళ్లయిపోయింది. అప్పటికెంత? సరోజిని ఏడేళ్లపిల్ల. తరవాత ఇద్దరు మొగపిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టారు కావుల్న!"

"ఏమిటో మీకంత మోజు! అయినచోట, ఎరిగున్నచోట పెళ్లిళ్లు చేసుకుని అన్నం విస్తళ్లు వీపుల పులుముకున్న వాళ్లని యెంతమందిని చూడడం లేదు? సీతాపతిరావుగారికూతురు పెళ్లిలో ఏమయింది?"

"అవును అప్పుడు అందరూ వీధినిబడితే పద్మనాభంగారేగా సర్ది చెప్పాడూ?"

"ఒకళ్లకి చెప్పాల్సివొస్తే అంతా పెద్దమనుషులే. తనకొడుకు పెళ్లిలో యేంజేశాడు చెపుమా! మూడు వేలూ పుచ్చుకుని మరదలి మాడ పెట్టాలనేసరికి మాకు మామూలులేదు పొమ్మన్నాడు. 'ఎంగిలిమంగలహారతి పెట్టమంటే నేగా అన్నం ముందర కీచులాడుకుని లేచిపోయింది.'

ఆయన్నేమిటో, ఇంద్రుడు, చంద్రుడు, అని కొండెక్కించబోతావ్!

ఆ పెద్ద పిల్లలకీ దీనికీ పోలికే లేదు, వొట్టి మాపుల గొడ్డు. పనీపాటూ, అసలే చేతకాదుట.

రెండో అమ్మాయిని మేనరికం యివ్వమంటే ససేమిరా అన్నవాడు యీ అమ్మాయిని యిస్తానని యేమని అడగబోయాడు?

వాడేనా అంత తెలివితక్కువవాడు? 'నేను చేసుకోను పొమ్మ'ని రిజిష్టరీ ఉత్తరం రాశాడు. ఆయన మాపులో తరవాత వైభవలం మనమే—అందుకనే యిక్కడ పాచికపారుతుందేమో అని యోచిస్తున్నాడు."

"అవన్నీ మనకు దేనికిరా? అయినా ఆయన ఇంగ్లీషు చదువుకున్న వాళ్లకే యివ్వాలని మొదణ్ణించీ పట్టుదలకలవాడు. ఏవో నాలుగు ముక్కలు చదువుకున్నామనేగా మనమంటే ఆశ..."

"ఆశకాదు, దురాశ—ఇంతకీ మనబంగారం మంచిదయితే..."

"ఛీ-వూరుకోవాళ్ల కుటుంబంసంగతి నాకు తెలుసుగానీ."

"తెలియనీగాక, పద్మనాభంగారి కూతుర్నే చేసుకోవాలని మీకంత ఆరాటం యెందుకు?"

"ఏదో... మొదణ్ణించీ చేలోకువైనపిల్ల. మనం యెట్టా చెబితే అట్టావింటుంది కదా అని. నేనూ పెద్దదాన్నయిపోయానా ఆమూడు ముళ్లూపడితే ఎక్కడో కృష్ణా, రామా అనుకుంటూ కాలం గడపాల్సినదానినే గదా!"

"నువ్వేదో అనుకుంటున్నావ్. చేలోకువైనది చెప్పినట్టుచేసి ఒరగబెడుతుందని. ఆ అమ్మాయికి ఒక్క పని చేతకాదుట. మనింటికివొచ్చి యీ గొడ్డూ, గోదా యెలా సవిరించుకుంటుందంటావ్?"

"అన్నీఅవే చేతనవుతాయి, ఆడపిల్లయి పుట్టిం తరవాత పనులు చేతకావా యేవిట్రా సోద్దెంగానికి వాళ్లఅమ్మ అన్నీ నేర్పేవుంటుంది!"

"అమ్మను చూపెట్టుకుని పిలని చేసుకుంటే రొండుచేతులా బావుకున్నట్టే! సీనయ్యగారు — అయినకేం లాటొచ్చిందని, ఇస్తానని మనయింటి చుట్టూ తిరగలేదూ? అక్కడికది పల్లెటూరి సంబంధం అయిపోయింది నీతమ్ముడికీ నీకూను. ఆయన పెద్ద కూతురికి 'మళ్లీ' పెళ్లి చేశాడని నీతమ్ముడికి జంధ్యాలు తెగిపోతై."

"ఛా, ఛా—మాస్తూ మాస్తూ అటువంటివాళ్లని యెలా చేసుకుంటాంరా! లోకులు యేమనుకుంటారు? మనకంత కక్కుర్తి యేం వొచ్చింది? నిక్షేపంలాంటి సంబంధం..."

"నిక్షేపం కుప్ప—తల బొప్పికడితేగానీ తెలిసిరాదులే! నాకెందుకు? ఈ సంబంధమే కనక ఖాయమైతే తీసుకొచ్చి యింటిదగ్గిర దిగవిడిచి నేనుమద్రాసు పోతాను"

"ఈలంకంత కొంపలో బిక్కుబిక్కుమంటూ 'మేం వొక్కళ్లమూ వుండగలమట్రా"

"ఏం జెయ్యమంటావ్ మరి? కొంప కనిపెట్టుక్కూచుంటే పనులు జరుగుతయ్యా? పేపర్‌కి 'డిక్లరేషన్' కూడా వొచ్చిందట, రమ్మని వుత్తరం రాశారు. వెళ్లక తప్పద."

"ఏమిటే వొచ్చిందంటావ్?"

"నేనూ, కొన్నాళ్లు వూళ్లంబడి తిరగాలి! వో పేపరు పెడుతున్నాం దాని ఏజన్సీలకోసం దేశమంతా తిరగాలి!

అందుకనే యీ అవస్థలన్నీ పడలేమనే నేను ప్రస్తుతం పెళ్లి వొద్దన్నాను. నీతమ్ముడూ, నువ్వూ పట్టుపట్టి చేస్తానంటే మీనెత్తినే రుద్దిపోతాను."

"మామయ్యతో అన్నావుట్రా యీమాట?"

"నీతో అంటే ఎంతో, ఆయనతో అన్నా అంతే. మాటచెబితే వొట్టివొల్లు కబుర్లంటాడు. ఎందుకులే నేను వెళ్లిపోతేగాని వొకొక్కర్లకే తెలిసిరాదు. పేపరుకి డబ్బుకావాలి. అసలీయిల్లు బేరం పెట్టెయ్యాలనుకుంటున్నాను"

"ఏమోనాయనా ఆ మొక్కు తీరితే నాకూ కొంత తెలికౌతుందిగదా అని."

"తేలికౌతుందని మీరంతా భ్రమపడతారు. మెడకి చుట్టుకుంటుందని తెలీదు?"

"రేపేవన్నా వొస్తాడేమోకాని, మావయ్యకు తొందరపడి వుత్తరం రాయకు."

"రాకేంజేస్తాడు. నీతమ్ముడి పన్నాగమంతా యెవరికి తేలియదు? ముందే ఉత్తరం రాస్తే కొంత

మథనపడతారుకదా అని. లేకపోతే నేరుగావెళ్లి పద్మనాభంగారితో నే చెప్పేస్తాను."

"కొంపతీసి అంత పనీచేసేవురోయ్! మనపరువు మీ నాన్న పరువుకూడా బండలైపోతుంది."

"పోతేపోయింది అంత్య నిష్ఠూర్యంకంటే ఆది నిష్ఠూర్యమే మేలు."

"నీకు తెలియదు రా నాయనా! పిల్లనిస్తానని మనముందరికొచ్చిన పెద్దమనిషిని తూలనాడినట్టౌతుంది."

"మనమేం యెదుటబడి పోట్లాడ్డంలేదు. ప్రస్తుతం మాకు అవకాశం లేదని చెపుతాను అంతే."

"మావఁయ్య వొస్తాడు కాదుట్రా అన్నీ వాడే చూసుకుంటాడు. మీ నాయన పోతూ పోతూ వాడికేగా అప్ప జెప్పి వెళ్లారు. 'చిన్న పిల్లలు వాళ్లకేం తెలీదు. నువుకని పెట్టి వుండాల'ని. చెల్లెలు పెళ్ళి అదీ వాడే పైన వేసుకు చేశాడా మరి.

"అన్నీ విచారించుకోకుండా మనకి ఉత్తరాలు రాస్తాడా? తీరాయిప్పుడు నోటిముందరి విస్తరిచింపుకు లేచిపోతే పదిమందీ పదిమాటలూ అంటారు. వాడి మనసుకూ కష్టం వేస్తుంది. మొదణ్ణించీ మనవ్యవహారాలన్నిచూసి పెడుతున్నవాడాయె! ఎక్కడివక్కడ వొదులుకొని వాడితో కీచులాడుకుంటే మళ్లీ మన గడపతొక్కుతాడా? పోనీ ఆ అయిదు వొందలూ కూడా వేసి మూడు వేలూ భర్తీచేయమని చెప్పమందాం. అసలు ఆ మాటా వాడే చెవుతానన్నాడుగా?"

"ఇటువంటి పైపూతలు యెన్ని పెడితే యేం లాభం, వాళ్లు మూడు వేలు కాదు. ముప్పై వేలిచ్చినా నా అనుమానాలన్నీ అట్టే తీసివెయ్యలేరెవరూ. తరవాత వచ్చేవాటిని అనుభవించడానికి సిద్ధమవండి నీ తమ్ముడూ నివ్వూను?"

*    *    *    *

"ఏవేఁ అక్కయ్యా, కొడుకు ఏవంటున్నాడమ్మా?"

"వొచ్చావుట్రా నాయనా, విశ్వనాథం? ఆఁ...ఎత్తుభారం అంటున్నాడు. ఈపూటే రాదల్చుకున్నవాడివి ముందుగా వుత్తరంకూడా యెందుకు రాశావ్? అది చేత బుచ్చుకొని మధ్యాహ్నంనించీ నానా హంగామా చేశాడుగదా కొంపలో. ఇంతకు మునుపేరా, అట్టాబజారుకని వెళ్లాడు!"

"ఏం ఎమంటున్నాడేమిటి?"

"దాన్ని తీసుకొచ్చి యింటి దగ్గిర దిగవిడిచి తనెక్కడికో 'చెన్నాపట్టం' పోతాట్ట. అవేవో పేపర్లుట, దేశమంతా తిరగాలిట, ఏవేవో...కాళ్లు కడుక్కో! దాహం కావాలా?"

"ఊఁ-చెన్నపట్నం వెడతానంటాడూ? కుర్రతనం చేష్టలంటే అన్నీ యిలాగే వుంటయ్."

"ఏరోజు కారోజు నాకు గుండెలుగూడట్టడం లేదురా. ఆ సీనయ్య కూతుర్ని చేసుకోవాలని బాగా వుందిరా వాడికి, చూస్తూ చూస్తూ యేం జెయ్యమంట"

"నీదగ్గిర అలాగే మాటాడుతాడు గానీ- పద్మనాభంగారు రేపు ఉదయమే వస్తాడు. తాంబూలాలు పుచ్చుకోడానికి"

"మళ్లీ యింకోసారి చూడాలంటాడేమో పిల్లని"

"వొసారి చూశాంగా చాలమూ?"

"ఏవోఁ- దానికి పనీపాటూ చేతకాదంటాడు, ఏమీ చదువుకో లేదంటాడు."

"తను చదివాడుగా చాలదూ? ఆడపిల్లలు అంతకంటే యేం చదువుతారు?"

"కట్నం సంగతి?"

"నేను మొన్ననే చెప్పాను, అందుకు ఆయనా వప్పుకున్నాడు. అన్ని సంగతులూ తేలినై. ఇంక తాంబూలాలు పుచ్చుకోవడం, యెవరి ప్రయత్నాలు వాళ్లు చేసుకోవడమూను. అడుగో వాడూ వొస్తున్నట్టున్నాడు."

"వాడేనా?"

"ఆఁ—వాడే."

"మాట్లాడుతూ వుండండి. నేను పోయి మడి కట్టుకుంటా"......

"మామయ్యా, నీపన్నాగమంతా నాకు మధ్యాహ్నమే అర్థమయిందిలే!"

"అసలు నేనివ్వాళవద్దా మనుకోలేదురా, గుమాస్తా సెలవు పెట్టిపోతే కోర్టులో దావా విచారణకి నేను హాజరు కావాల్సొచ్చింది. సరేగాని పద్మనాభంగారు రేపు ఉదయమే వస్తున్నాడు."

"నేను యీ రాత్రిబండీకే బయల్దేరి వెడదామనుకుంటున్నాను."

"ఎందుకు?"

"అక్కర్లేదని చెప్పెయ్యడానికి"

"మొత్తానికి కుర్రతనం చేష్టలు పోనిచ్చావ్ కాదు."

"నీకు ఆనాడే చెప్పాను కదా. ఇంతవరకూ యెందుకు రానిచ్చావసలు?"

"పిచ్చివాడా! నేను రానిచ్చేదేవిట్రా? కల్యాణం ఘడియ అలా తోసుకువస్తోంది. ఇంక యెవరు ఆపినా ఆగదు."

"నువ్వు నూరు చెప్పు, వెయ్యి చెప్పు, నాకు

మాత్రం యిష్టం లేదయ్యా, ఇప్పుడుమటుకు మనం వొద్దంటే ఆయన యేం జేస్తాడు?"

"మనకు పరువూ, మర్యాదా అక్కర్లా? తీరా రేపు పొద్దున్న తాంబూలాలు పుచ్చుకుందాం. రమ్మంటే, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని వద్దం టాంరా?"

"నీకు న్యూనతగా వుంటుందనే నేను బయ ల్దేరతానంటున్నాను."

"ఎవరు వెళ్లినా నాకే న్యూనత. మొదణ్ణించీ యింతవరకూ తీసుకువచ్చింది నేనే కనక!"

"నేను యెన్ని చెప్పినా మీ మాటే మీకు."

"ఇప్పుడు ఏమంత కొంప మునిగిందంటావురా"

"నూరు అబద్ధాలాడయినా వో కొంపనిల బెట్టా లని మీరు చూస్తారు. అది చివరకు అతుకుల బొంత గానే తయారవుతుంది. పొరపాట్లు చేసేది వొకళ్లు, ఫలితం అనుభవించేది యింకొకళ్లూను."

"ఇప్పుడంత ప్రత్యవాయం రాలేదుగానీ, అన్నీ అనుకున్నవి అనుకున్నట్టు సజావుగా జరిగిపోనియ్యి"

"అసలు ఆ అమ్మాయికి వొక్క పనికూడా చేత కాదుట. మనం వున్నది బస్తీలోనే అయినా గొడ్డు గోదావున్నవాళ్లం. ఇవన్నీ చక్కబెట్టుకునే తెలివి తేటలు వున్నవా అనీ. ఏమో నాకు అనుమానమే. ఆవిడవొచ్చి తనను అందల మెక్కిస్తుందనుకుంటుంది. మా అమ్మ."

"పుట్టగానే పనులన్నీ చేతనవుతయ్యట్రా. ఇప్పటికి మీ అత్తయ్య స్వతంత్రించి లడ్డూలు కట్ట లేదు. ఒక్క పిండివంటయినా చెయ్యలేదు."

"లడ్డూలదాకా పోతావ్! పాలకుండ ఉట్టిమీద పెయ్యడం చాతవునా అని."

"నేనూ అన్నీ విచారించానురా అబ్బాయి. తల్లిచాటు పిల్లకనక, స్వతంత్రంగా చేసే అవకాశం వుండదు. కాబట్టి అంత భారీ యెత్తుపనులు చేయలేక పోవచ్చుగాని, నిత్య కృత్యంలో చేసుకునే పనులే చాతకావనా దాని అర్థం? వాళ్ల యింటి ప్రక్కనే వున్న సీతాపతిరావుగారి నడిగి అన్నీ తెలుసు కున్నా."

"నాకూ ఆయన కొడుకే చెప్పాడు. వాళ్లమ్మ నెత్తిన నోరెట్టుకు వాగుతున్నా యివతల చెంబుతీసి అవతల పెట్టదుట. మరోవిచిత్రం. విన్నావో, లేదో తెలివితేటలు యెంతవరకూ వున్నయ్యో వాడు బాగా పరిశీలన చేశాట్ట.

"వాళ్లతమ్ముడి బాలసారె నాడు పద్మనాభం గారింట్లో అందరూ భోజనాలకి వొచ్చారుట. వీడూ వడ్డిస్తున్నాడట. అది సేమ్యాపాయసం పాలతో పర మాన్నం వండితే ఆ యమ్మాయికి సయించదట అందు కని వాళ్లఅమ్మ దగ్గిరేకూచుని చెబుతోందిట. యీ పరమాన్నం చల్లపోసిందేను తినొచ్చు, అని. అట్టా చెప్పి తినిపించడం వాళ్లకు అలవాటు కావున్ను- అప్పుడు తినేసిందట.

ఇది జరిగి రెండుమూడేళ్ల యందనుకో. అయినా తెలివితేటలు అంతకంటె పెరిగినయ్యని నేను అను కోను."

"వాడేదో ఆకతాయితనానికి చెప్పిన మాటలు గానీ, పరమాన్నం పాలతోకాక చల్లతో చేస్తారని యెంత తెలివి తక్కువ వాళ్లయినా అనుకుంటా రట్రా?"

"ఎందుకనుకోరు? తెలివితక్కువలో కూడా 'హైక్లాసు' అన్నమాటా? ఇటువంటి సంబంధం చేసుకుని యాతన అనుభవించేకంటే...ఈ రాత్రే నేను బయల్దేరిపడతాను. నేనామాట అంటే చిన్న నోటికి పెద్దసోకం అంటారుగాని. అందచందాలు, భాగ్యభోగ్యాలమాట అటుంచి కుంపటిమీద అత్తె సరు పెట్టుకుతిన్నా గుట్టు చప్పుడు కాకుండా గడుపుకు పోయే తెలివితేటలు లేనప్పుడు ఎన్నివున్నా అవన్నీ రాణించవు సరిగదా పైపెచ్చు మనబోటివాళ్ల ప్రాణా లును తియ్యడానికే పనికివస్తయ్. అవి మినహాయించు కుని వేటికోసమో పాకులాడితే ఆ యిల్లు అయోమ యంగానే వుంటుంది. నువ్వాలోచించు! నేచెప్పిన మాటల్లో అబద్ధం ఏమైనా వున్నదేమో..."

"మాఅమ్మకు ఇలాటి వేమీ తెలియవుకనక ఆవిడ మోజుపడిందంటేపడొచ్చు మరినీకుఆనాడూ చెప్పాను అవే యీనాడూ చెబుతున్నాను. అంతమాత్రం విచా రించకుండా ఆయన్ను రేపుపొద్దున్నే రమ్మని చెప్ప డంలో అర్థం యేమిటి?"

"ఎవరు ఆలోచించినా చెయిదాటి పోయింతరు వాత చేసేదేవుంది! అన్నమాటకు తభావతు చెప్పు కుంటే మొన్నాడు మనవిలువ యేంవుంటుంది. అదీ గాక...మీ నాయన వుండగా..."

"సరే—మీయిద్దరికీ యిదొకవంక దొరికింది. యీవిడ తెలివితేటలు అన్నీ ఆనాడు ఆయనకు తెలిసే అన్నాడంటావా?"

"తెలీకపోవచ్చు, కాని పదిమంది యెదటా చేతులో చెయివేయించుకున్నాడా లేదా? ఇప్పుడు వాళ్లనందర్నీ సాక్ష్యం పెట్టి, కోర్టులో దావా వేసైనా యీ పెళ్లి చేసితీర్తాడు పద్మనాభంగారు.

మీనాయన చచ్చిపోవచ్చుగానీ ఆయనమాటకు ఇప్పటికీ అంతవిలువా వున్నది తెలుసునా?"

"అంతమాట పట్టింపుగలమనిషి మధ్యలో మేనరికం కోసం రాయబారాలు జరిపి శృంగభంగమయి కూచున్నాడెందుకు ?"

"అసలు విషయం నీకు తెలుసునా, నాకు తెలుసునా? వాడెక్కడో పరాయిసంబంధం కోసంపోతూ మేనరికం అడ్డొస్తుందని పిలవని పేరంటంగా నో రిజిస్టరీ వుత్తరం రాశాడని ఆయన చెప్పాడు.

పనిపాటల విషయం మీయింటికి వచ్చింతరవాత చూసుకో! అవన్నీ సర్దుకుపోయేందుకు మీయమ్మవున్నదిగా! హమేషానువు ఇంట్లో వుంటొచ్చావా?"

"ఇంటికి వచ్చింతరవాత యింకా చూసేదేవిఁటి ఆకాశం? ఇప్పుడే ఊరిపడుతోంది, ఇంక కాళ్లకింద పీటలుకూడా తీసెయ్యడమే తరువాయి."

"అబ్బాయ్! ఇందులో నాకేదో స్వార్థం వుందని భ్రమపడుతున్నట్టున్నావ్, మీనాయన చచ్చిపోయినదగ్గిర్నుంచీ నేను చేసిన పనులన్నీ నీకు తెలుసు. వాటిల్లో నాకెంత స్వార్థంవున్నదో అదీ తెలుసు. ఇప్పుడైనా చచ్చినవాడిమాటవిలువనుబట్టేగాని మరేవీఁ లేదు. ఇదికూడా సానుకూలమై అవతలపడితే, అక్కడితో ఆయన నామీద పెట్టిన బాధ్యతను నిర్వర్తించుకున్నవాడనౌతాను.

ఈ క్షణంలో యెవరువద్దన్నా పద్మనాభంగారు నే చెప్పినతీరుగా చేసేమాటే ఖాయం. తరవాతసంగతి ఆలోచించుకో! వెళ్లమంటే నేను ఇప్పుడే వెళ్లిపోతాను."

"ఏవిట్రా ఆ గందరగోళం?"

"ఏవుఁంది. నీకొడుక్కి యీ సంబంధం వద్దుట. పోనీ—నాకెందుకు. నేను ఇప్పుడే వెడుతున్నాడు. అబ్బాయ్, వొకసంగతి మాత్రం జ్ఞాపకం వుంచుకో, సీనయ్యగాడి కూతుర్ని చేసుకోవాలని వూగులాడుతున్నట్టు విన్నాను. అదిగనక అవిఘ్నంగా జరిగిందా, నేను మీగడపలో అడుగుపెట్టేమాటసున్న. మీపటం మీ నెత్తిన పొడచుకోవాల్సిందే! వ్యవహారాలన్నీ చూసుకో, యీ కాయితాల కట్టలు ఇక్కడే పడేసిపోతాను."

"ఏవిఁట్రా విశ్వనాథం, వాడితోపాటు నువ్వుకూడా! ఆసంచీ అక్కడ పెట్టు, నువ్వే అట్టావిదిలించి కొట్టి లేచిపోతే మాఅతీగతీ కనుక్కునేవాళ్లెవర్రా?"

"ఏం జెయ్యమంటావమ్మా, వ్యవహారం నాచెయి దాటిపోయినప్పుడు ?"

"నీ చెయ్యీ దాటలేదు. నా చెయ్యీ దాటలేదు. దొడ్లోకిపోయి కాళ్లూ మొహం కడుక్కుని మడికట్టుకురా!...పద!...ఎంత చెడ్డా వాడుమామయ్యగదా, వాడితో కీచులాడుకుంటే మనకు ఏం పనులు సానుకూలమవుతయరా అబ్బాయ్! పోనీ పనిపాటలన్నావ్, వాటిసంగతి మేం చూసుకుంటాంగా! పొద్దస్తమానం యింట్లోవుండి అన్నీచెప్పి చేయించుకునేదాన్ని నేనాయె, నువు ఎక్కడికో చెన్నాపట్టం వెడతానంటుంటివిగా, వెళ్లు. తీరా యింతవరకూ వొచ్చింతరవాత చెయికాల్చుకు లేచిపోతే యేమైనట్టురా? నలుగురూ మనల్నంటారా, ఆయన్నంటారా ?"

"ఈ శాంతమంతా నీవొక్కదాని మొహానే మొలవలేదు. తెల్లారిలేస్తే యెంతమందిని చూట్టంలేదు? అంట తెప్పాలాలు, యెంగిలిచేతుల్తో, వీధులబడిసంసారాలు వొకొలిక్కి తెచ్చిన అత్తాకోడళ్లంతా మొదట నీలాగా కబుర్లు చెప్పినవాళ్లే."

"పోనీలే అవన్నీ నానెత్తిన వేసుకుంటాగా, నీకెందుకు ? ఇప్పుడు కాదు కూడదని అప్రతిష్టపాలు కాకు! జరిగేదేదో సజావుగా జరిగిపోనియ్యి! యీ గోడవంక చూడు! మీనాయన మొహం చూసైనా..."

"నాయన మొహం చూశాను, నీ మొహమూ చూస్తూ నేవున్నా—"

"తల్లీ కొడుకులు ఏం ఆలోచించారమ్మా చివరికి?"

"ఆలోచించేందుకు యేముందీ? రేపు పద్మనాభంగారు రావడమే తరువాయి!"

"ఆయన ఆలస్యం యెప్పుడూ వుండదు. రేపు తొమ్మిదిగంటలరైల్లో వూడిపడతాడు."

"ఆయన రాకేం జేస్తాడు? ఆయనా వస్తాడు, తాంబూలాలు పుచ్చుకుంటారు, పెళ్లి జరిగిపోతుంది. తరవాత ఏం జెయ్యాలా అనే ఆలోచన—"

"దానిసంగతి మేం చూసుకుంటాం, నువుచెన్నపట్నం వెళ్లు!—అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. నీచెల్లెలు శ్రీలక్ష్మమ్మ మొగుడికి ఈవూరే ట్రాన్స్‌ఫరయింది. వారంరోజుల్లో వాళ్లూవచ్చేస్తారు. మీ యింట్లోనే వుండమని చెబుదామనుకుంటున్నాను. మీ అమ్మకూ మీ యావిడకూ కూడా సందడిగా వుంటుంది."

"ఇంకా ఏం, అదీబాగానే వుందిరోయ్! వాడు చెన్నాపట్టంపోతే లంకంత కొంపలో మేమిద్దరం యెట్టావుండగలమా అనుకుంటున్నాను. మా శ్రీలక్ష్మి వొస్తే అన్నిపనులూ అదే చూసిపెడుతుంది, వొదినకి సావాసంగానూ వుంటుంది"

"మంచిఆలోచనలే చేస్తావుంటావయ్యా నువ్వు! అలాగయితే కాపరం తొందరగానే పొడుగౌతుంది!"

౨

"ఏం సీతమ్మత్తా, కొడుకుదగ్గిర్నుంచి ఉత్తరాలు వొస్తున్నయ్యా ?"

"ఎవరు, లక్ష్మీకాంతమా ? రా, కూచోమ్మా! ఆహా...వొస్తూ నేవున్నయ్ ఉత్తరాలకేం భాగ్యం? నిన్న నే రాశాడు అదేదో చితురినాపల్లి, నుంచో యెక్కణ్ణించో, యెందుకు వెళ్లాడో మరి!"

"అదేవిటి తిరుచినాపల్లేమో అత్తా!"

"అదే కామాలు, వాటి పేర్లుకూడా నాకువొచ్చి యేడవ్వ. అక్కణ్ణించే రాశాడు. అవును గానీ లక్ష్మీకాంతం, ఎప్పుడొచ్చావ్ అత్తారింటి దగ్గిర్నుంచి?"

"రాత్రే వొచ్చానత్తా!"

"అలాగుటే నాకు తెలియనే తెలియదేఅమ్మా"

"సరేగానీ, యీమధ్య యెప్పుడన్నా వొచ్చాడా కొడుకు ?"

"ఎబ్బే! వాడెక్కడొచ్చాడు, రానూ లేదు, పెట్టా లేదు, అన్నంత మాటా చెల్లించుకోవొద్దూ ? ఇక్కడ అన్నీ నా నెత్తిన రుద్ది— ఎందుకులే యేవన్నా అనుకుంటే నానోరే బైటపడుతుంది"

"నాలుగు నెల్లు కాలా పెళ్లి ?"

"ఆ— మొన్న దశమినాటికి ఖరాగ్గా నాలుగు నెల్లూ నిండినై. ఏవోనమ్మా, వాడిచిత్తం. నెలకొస్తాడో...రోజెల్ల కొస్తాడో...యాడాదికే వొస్తాడో— నేనొకత్తెను వున్నాగా యింటిదగ్గిర చెప్పు దెబ్బలకీ పాణ్ణీళ్లకీను! అదికాదే అమ్మాయ్, అక్కడ మూణ్ణిద్దర్లయి వొచ్చింతరవాత ఏ నాలుగురోజులున్నాడో...అంతేగదా. మళ్లీ యింటివేపుకి తిరిగిచూడకపోతే యెట్టా వుంటుందో చెప్పు! అంతా నన్ను దుయ్యబడుతున్నారే."

"పోనీ పదిహేనురోజులకో నెలరోజులకో వొచ్చి పెళ్లాన్ని కూడా తీసుకుపోకూడదూ ?"

"అదేఅంటున్నాను. ఇక్కడ నానెత్తికెక్కించి తను దేశాలంబడి తిరుగుతుంటే చూసిన నలుగురూ యేమంటారో...పోనీ నువ్వే చెప్పు! ఒక నాడా, రోజ్జాళ్లా, నాలుగు నెలలైపాయె! ఎన్నింటికని వేదన పడేదే అమ్మాయ్!"

"శ్రీలక్ష్మమ్మొదిన యింట్లో లేదా యేవిటి?"

"శ్రీలక్ష్మమ్మావుంది, చెంచులక్ష్మమ్మావుంది. దాని మొగుడు, పిల్లలు దాని సంసారంతో దానికి సరిపోతోంది. నేను వొక్కదాన్ని యెన్నింటికని యేడ్చేదే లక్ష్మీకాంతమ్మ తల్లీ!"

"అదేవిటత్తా, కోడలుండేను, కూతురుండేను. వొక్కదాన్ని, అని దిగులుపడతా వేవిటి ?"

"ఉండడానికేం అందరూ వున్నారు. అక్కరకు రాకపోతే యెందరువున్నా యేం లాభం ?"

"కోడలు యింట్లో కాఫీ పెట్టుకుంటుందా యేవిటి ?"

"కోడలూ, కోతీను—పుట్టింటికివెళ్లి మొన్న నే వొచ్చింది. వాడుకూడా యిక్కడలేడా, యిహదాని యిష్టా రాజ్యమే అనుకో ? వొకపనాశా, పాటాశా, బొత్తిగా లేదుగదా! ఎందుకు, ఏమన్నా అంటే నానోరు నొక్కుతారు.

వాడు అననే అన్నాడు 'పాడుముండా, నీ నెత్తి నెక్కించిపోతాను అనుభవించమ'ని అందుకే రెండు చేతుల్తోనూ అంకెళ్లు నొక్కుకుని కొంకిపురుగులాగా వోమూలపడి యేడుస్తున్నాను."

"అదుగో, నీకోడలే కామాలు కొళాయిదగ్గిర మొహం కడుగుతున్నట్టుంది."

"అదుగో! ఇదీవొరస—నువ్వు చూస్తూ నే వున్నావుకద ? ఇప్పటికి తొమ్మిది కావస్తోంది మొహమన్నా మొద్దులు చేసుకుందేమో చూడు!... అట్టా చూస్తావేం ఇవ్వాళే అనుకున్నావా ? యీ నాలుగు నెల్లనించీ యిదేతీరు. నాయెవికలు కొరుక్కు తింటోందంటే నమ్మవే నా తల్లీ!"

"మజ్జాహ్నంపూట వొంట కోడలే చేస్తుందా అత్తా ?"

"వొంటా ?—వొంటా లేదు వల్లకాడూ లేదు. అయ్యో—నారాత—వొంటచేయించుకు తినేగీతే వుంటే మాకీ మిడిమేళాం దొరక్కనేపోను. అన్నిందాలా నా కంఠానికి వొచ్చిపడిందే అమ్మా!"

"అదేమిటమ్మా అత్తా అట్టా అంటావు ? పద్మనాభంగారి కూతురు మీ కోడలైందని పెళ్లిలో సంబరాలు పడ్డావుగా!"

"ఆసంబరాలేనా నెత్తణిచినాయమ్మా, వాడెంత వుండాకోరు పనిచేశాడనుకున్నావ్ ? ఆ పద్మనాభంగాడే—ఎన్ని వగలుపోయాడు ? ఎన్ని ఇచ్చగాలు పలికాడు ?—ఇంతకీ నాకర్మ ఎవర్నన్నా యేం లాభం ? మా విశ్వనాథం అడిగాడుగా, ఆ సీతాపతిగాడన్నా నిజం చెప్పరాదూ? అంతాపోగైనా నోటే గడ్డకొట్టాలీ ? ఈకసి, ఆకసి, అన్నీలోపల పెట్టుకున్నాడు. వాడిదారిన వాడు చెన్నాపట్టంపోయి కూచున్నాడు.

ఏమైతే యేం లాభం ? చెయి కాలింతరువాత ఆకులకోసం వెతుక్కుని లాభమేవిటి ? తవ్వకున్నకొద్దీ వుంటుంది—ఇదుగో అత్త పనిచెప్పిందనుకోక, యీ తోటకూరబొత్తి కాస్తా తరిగి ఆ దోసకాయలు రెండూ పచ్చడిముక్కలు తరిగిపెట్టమ్మా! ఇదుగో

అమ్మాయీ! దేవుణ్ణయి వేద్యంవుందిగానీ, దోసకాయ చేదో, తీపో చూసి కిందవుమ్మెక్క. నమిలి మింగవోకు! యీరొండుగుడ్డలూ వుతుక్కుని కొళాయిదగ్గిర స్నానం చేశొస్తా!"

"సరేలే అత్తా, యీ భాగ్యానికి యిన్నిసార్లు చెప్పాలా? చెయ్యార్యుకుంటే శ్రీ లక్ష్మమ్మొదిన్ని వోసారి యిలా రమ్మని చెప్పు!"

"అట్టాగే!"

.....................

"సరేలే, యీ వూరొచ్చింతరవాత అన్నయ్య చేత వోవుత్తరమైనా రాయించావుకాదుగా అమ్మా"

"ఎప్పటికప్పుడే నేనురాయమనడమూ, ఆయన మర్చిపోవడమూను"

"అవున్లే అన్నీ ఆయననెత్తినే తోసేద్దామని."

"ఈ భాగాన్యికి యెవరి నెత్తిన తోసినా యేవుందిగానీ, అన్నట్టు నువు కూర తరుగుతున్నా వేమిటమ్మా వొదినా? అమ్మగానీ తరగమన్నదా యేం?"

"ఆఁ...వూరికే కూచోలేక నే నేతరుగుతున్నా"

"కాదులే అమ్మే తరగమని వుంటుంది. ఇట్టా బయటపడిపోతుందమ్మా ప్రతి విషయంలోనూ నీ వొక్కదానిదగ్గరే కాదు."

"అంత బయటపడిపోవడానికి ఇందులో పరాయి వాళ్లెవరు?

"నువు పరాయిదానవు కాదుసరె, యెవరు వాకిట్లోకి వొచ్చినా యిట్టాగే రాచిరవధూళి చేసుకుంటుందమ్మా!"

"ఆవిడమాత్రం వొక్కర్తే యేం జేసుకుంటుంది చెప్పు, మీఅన్నయ్యేమో అక్కడికెళ్ళికూచున్నాడు. మీ వొదినేమో వొట్టి అయోమయమాయె! ఎన్నాళ్లని తంటాలుపడుతుంది? అయినా మీఅన్నయ్య అక్కడే కూచుని తిరిగి ఇంటిమొహమేనా చూడకుండా ఎవర్ని సాధిద్దామని?"

"ఒకర్ని సాధించేదేవిఁటి, యింటిదగ్గిరకూచుంటే వాడిపనులన్నీ యెవరుచూస్తారు? మొదణ్ణించీ వొద్దో మొర్రో అని మొత్తుకుంటుంటే తమ్ముడూ యీవిడా కలిసి వాడిమెడకు కట్టి యిప్పుడు అందరిదగ్గిరా వెళ్లబోసుకుంటే యేమైనట్టు? అయోమయమో, అంధకారమో-చేసుకున్న తరవాత అనుభవించి తీరాల్సిందే. చేతులారా చేసుకున్నవాళ్లకు చేసుకున్నంతా మహాదేవా!"

"నేను అనేది అదికాదమ్మా కాస్త పనిలో పాటలో అడ్డం రాకపోతే పెద్దది ఆవిడకిమటుక్కు కష్టంగా వుండదూ? అదుగోచూడు యింకా వేలు నానేసుకుని దొడ్డి అరుగుమీద కూచున్నది. మనమంతా యిట్లాగేవుంటున్నామా?"

"అవును వాళ్ల అలవాటు అదీ—ఇప్పుడు వీధిని బడితే యేమైనట్టు? వుంటావుగా వొదినా ఆయనకి ఆఫీసుకైమాతోంది. అమ్మవొచ్చింతరవాత వోసారి అటుకేసిరా!"

"వొస్తాలే!"

.....................

"వున్నావుటే లక్ష్మీకాంతం?"

"ఇక్కడేవున్నానత్తయ్యా ఇదుగోదోసకాయ పెచ్చుతీస్తున్నా"

"చూడు దానిదుంపతెగా, పెద్దముండనికదా కొళాయిదగ్గిర స్నానం చేస్తుంటే విడిచిన గుడ్డలన్నీ తీసుకొచ్చి కుండులో పడేసిపోతుంది! అని తెలియని తనమా, శాణాతనమంటామా? వీరంతా అత్తారిళ్ల దగ్గిర యిట్టాగే కాపరాలు వెలగబెడుతున్నారూ? వెనకనించి పిలుస్తుంటే 'పీపూ వినవే' అని అదేపోక గదా! ఎంత తెలియనివాళ్లకైనా చెప్పొచ్చుగానీ, యిటువంటి గడుసుబొందలకా? అమ్మనాతల్లీ నేవేగలేనే అమ్మా! పీడిపేపర్లూ పీడూ బండలైపోను యీ కుంపటి నామెడకు కట్టిపోయినాడే అమ్మా!"

"నువెళ్లి తడిబట్టలు ఆరేసుకురాఅత్తా తరవాత మాట్టాడుకుందాం!..." ఇదుగో అమ్మాయీ అట్టా అనుకుంటున్నా వేమిఁటి? దణ్ణానికి మడిబట్టలు కట్టుకుని ఏమర్చివుండే ఆస్కారం లేదుగందా! దేనికో వోదానికి అటుపోతూ కొంగువేసి కొడతుంది. తగిలిందనైనా చెప్పదు. పోనీ ఆ బట్టలుతడిపి యివ్వమని మొత్తుకున్నా యిహమాటా పలుకూ వుండదు. అప్పుడు మళ్ళీ మయలపడి అవన్నీ తడుపుకుని కూలిపోతాను.

అంటూ సొంటూ అసలేలేదుకదా! అన్నంతినేటప్పుడు వొళ్లో మెతుకులుపడ్డా ఇట్టేదులిపేసి వూరుకుంటుంది. చెయ్యన్నా కడుక్కోదు. బట్టలమీద నీళ్లన్నా చల్లుకోదు. ఆనాయన యెట్టా పెంచాడో కానీ, నా ప్రాణాలు తియ్యడానికి భగవంతుడు ఇక్కడికి పంపినందుకు చెప్పాలి!"

"నువ్వేగా అత్తా బలవంతం చేశావుటా?"

"రామ రామ—నాకేం తెలుసునే యిదింత వినపనకొయ్య అనీ—అసలు నేను ఏపనీ చెప్పనే చెప్పను. ఖర్మంజాలక యేమడి కట్టుకున్నప్పుడైనా చెప్పానో, ఇదీ వొరస—ఖరాగ్గానుంచుని వూరుకుంటుంది. ఇదినాకు చేతవును. చేతకాదు, అనయినా చెప్పదు. దీపస్తంభంలా నుంచుంటుంది అంతే. నాకెక్కడ దాపురించిందే తల్లీ ఈ మూగదయ్యం!"

"అత్తా అదికాదుగానీ, ఆ అమ్మాయికి చేతనయినపనులే చెప్పి చేయించుకోరాదూ ?"

"మండినట్టేవుంది నీ వుపదేశం. నాకు వొళ్లు భగభగా మండుకుపోతోంది యేవఁనుకున్నావో! ఏవీ చేతకాకపోవడానికి—ఇవతల చెంబుతీసి అవతలపెట్ట లేకపోవడానికి—తనేఁవన్నా బొట్టికాయా యేవిఁటి? పదహారు పదిహేడేళ్లు వొంటిమీదకొస్తే — తనీడువాళ్లంతా నిమ్మకినీరెత్తినట్టు గుట్టుచప్పుడుకాకుండా కాపరాలు చేసుకోడంలా ? మా వొఖ్ఖళ్ల మొహానే పొద్దుపొడిచిందా యేవిఁటి ?

చాతకాదుట—పాలకుండతీసి వుట్టిమీదనెయ్యడమన్నా చేతకాదూ ? కళ్లులేని గుడ్డిముండ చుట్టబెట్టుకుపోతుందే యిటువంటి పనులన్నీ.

సోద్దెం కాకపోతే—వోనాడు పాలతంపెలోదాలి యెక్కవవేశాను. పాలుపొంగి పొయిలోపడిపోతున్నాయ్. మడికట్టుకు వొంట చేసుకుంటున్నదాన్ని ఆకుండె యెట్లా ముట్టుకుని కూలిపోయేది ! గొంతుక-చించుకున్నా గదిలోనించి యివతలికి కదిలి రాదే! వోక్రమాలకి వొచ్చి దరవాజా పొడుగునానుంచుని వూరుకుంది. "ఎందుకు పిల్చారండీ అత్తయ్యా, అని అడగడానికి నోరులే ?" 'ఆకుండదింపి చల్లారింతరవాత ఉట్టిమీద నెయ్యవే, అన్నానమ్మా! ఇదీ నేను చేసిన అపరాధం. తుమ్మల్లో పొద్దుకూకినట్టు మొహం పెట్టుకుని 'మొటమొట్లాడు'కుంటూ వొచ్చింది. కాగేకాగేకుండతీసి 'తపీమని'వొద్దున పెట్టింది. ఇట్టే చూద్దునుగదా ఆకుండఅడుగున బీట్టువాసి పాలు చిమ్ముడం మొదలెట్టినై. ఆకుండ అడుగునపట్టుకుని ఉపాయంగా మరొహదాంట్లోకి కుమ్మరించ వేఅన్నాను. తడిగుడ్డ ముందరపడేశాను. నామాట నానోట్లో వుండగానే మాతిపుచ్చుకుని గభాల్న పైకెత్తింది. అడుగడుగూ జారిపోయింది. పాలన్నీ నేలపాలైనాయ్."

"ఊఁ—"

"ఇంక ! ఊఁ లేదు—ఆఁ... లేదు ఆ పెంకులు అక్కడే పారేసింది, 'టింగ్ రంగా' అని గదిలోకి పోయికూచుంది. కుండెడుపాలూ దేలపన గలిసినాయని కొస్తంత విచారమైనా వుందంటావా ఆ మొహానికి?...ఏదో...ఆయన వుండగానే గేదెనుకొని పాడి మొదలెట్టాను, బజారు చల్ల బొత్తిగా నోటికెక్కవు కదా అని. ఇంకా యీమాదిరి మనుషుల్తో పాడేం సాగుతుంది నాపాడె. ఏవఁన్నా పనిచెయ్యమంటే యిదీ తంతు. వోసారి నేతి పిడతబోర్లించేదయితే అప్పుడు నేనే మయలపడి అది తిన్నగా వుట్టిమీదేసుకున్నాను. ఎన్నింటికని నేనొక్కదాన్ని చచ్చేదే అమ్మాయీ చెప్పు!"

"అత్తా. వొక్కమాట అడుగుతాను చెప్తావా. నువ్వు యిలా విసుక్కుని కేకలేసుకుంటుంటే నీతో కూడా కలబడి పోట్లాడుతుందా ?"

"అసలు మాటకు మాట సమాధానం చెబితేనా! వొట్టి బెల్లంకొట్టినరాయి. నువ్వు యేమైనా అను, మరేమైనా తిట్టు, కట్టుకొయ్యల్లే ఖరాగానుంచుంటుంది అంతే.

వోనాడు ఏమైందనుకున్నావ్, నేనీతీరునదీంతో తలబద్దలు కొట్టుకుంటుంటే ఆ తండ్రివొచ్చి అడ్డమైన మాటలూ నన్నే అనిపోయినాడు. నోరెట్లా వొచ్చిందో—వాడెంత పుండాకోరు పురిపిడికాయ అనుకొన్నావ్! మొదణ్ణించీ మాతోవుండి తిని, తిరిగి యీ రొమ్ములకుంపటిని నా మెడగట్టింది కాకపోగా చివరికి నన్ను వీధిలోపెట్టి నానామాటలూ అనిపోతాడూ ? వేపకాయ ముండాకొడుకు. ఒక్కొక్కళ్లకే చేసిన మేలంతా యీతీరుగా విషమైపోయిందే లక్ష్మీకాంతమ్మతల్లీ! ఇంతకీ నాకొచ్చిపడింది యీ మిడిమేళాం.

నారాత కాకపోతే ఆయనకంటె ముందరే విరగడైపోకూడదూ ? యీరవఖ అంతా లేకుండాపోను. బతికుండి బావుఁకున్నదే విఁటో చెప్పు! "తొందరగా తీసుకుపోరా నాతండ్రీ!" అని తెల్లారి లేచిన దగ్గిర్నుంచీ ఆ సూర్యనారాయణమూర్తికి వెయ్యిదణ్ణాలు పెడుతున్నా. నేను చచ్చిం తరవాతగానీ వాడొచ్చి యీ సంసారం పాడుకుంటాడేమో... నేను బతికలేనే తల్లీ ! ఘడియసేపుకూడా బతకలేను. అన్నంవార్చుకొచ్చిందిగానీ—ఆ తరిగిన తోటకూర జల్లిబుట్టలో పడెయ్యి కడిగి తీసుకుంటాను."

.............................

"అదీ మా ఖర్మమే కాకపోతే గోత్రం వొకటైపోయిందిమాకు, లేకపోతేని క్షేపంలాగా నిన్నే చేసుకునేవాళ్లం."

"చాల్లే అత్తయ్యా ఏం నీకోడలేవఁన్నా అందం తక్కువైనదినా ?

"ఎందుకు అందం అడుక్కుతినడానికి ? పనిపాటలే ఆడదానికి అందం. గురిగి రాచిప్పల్లే ఎక్కడ కూచుంటే, అక్కడే పొద్దుకూకే దానికి అందచందాల్తో అవసరమేవుందే అమ్మాయ్. వో, ముద్దూ ముచ్చటా, వొకళ్లు చెప్పడం, తను వినడం లేకపోయింతర్వాత యేమివుండీ యేం లాభం ? మా రోజుల్లో కోడికుయ్యనే లేచి రాత్రి పదింటికి పడుకోపోయేదాకా యేదో చాకిరీతోనే సరిపోయేది. ఇట్టే నడుంవాల్చడానికి వీలుండేదా ? ఇట్టా కూచుంటే మా బతుకు వొక్కరోజునే తెల్లారేది. మీ అమ్మ

నకుగు తెలుస్తుంది, ఏతీరున రెక్కలు ముక్కలయ్యే ట్టు చేసుకు నేవాళ్ల మో..."

"ఈరోజుల్లో ఆడవాళ్లకి నిజంగా అటువంటి పనులూ లేవు, ఏమంటావత్తా ?—వోవొడ్లు దంపడమా పేడచెయ్యడమా ?"

"వొడ్లుకూడా దంపుతారు యీ వాజమ్మ మొహాలు! వున్న పనులన్నా ముట్టుకోకుండా కూచు నే ముద్దేశ్వరి మాకే దొరికిందిగానీ, యింత పచ్చికలి ప్రపంచంలో యెవ్వరికీ లేదే నాతల్లీ! పులుసు వుడికి నట్టుంది వోవా తేసి దింపివొస్తా"

.........................

"యిహ భోంజేస్తారు కొమాలు నేను వెడతా నత్తా!"

"సరేలే, నాతోపాటు అన్నానికివొచ్చి అగో రించడం యెన్నడూ లేదుగా! కూడా కూచోపెట్టు కుంటే ఇల్లంతాఅంట మంగలంచేసి, మయిలేసి నానా మాలకూడూ చేస్తుంది. నామీద నీళ్లుపోస్తే తింటూ తింటూ వున్న అన్నం వొదిలి పెట్టి యెన్నిసార్లు లేచి పోయామో...ముందో, వెనకో పెట్టి తిని పొమ్మనా ల్సిందేగాని, లేకపోతే నాగడ్డి నాకు తినిపించిందన్న మాటే!"

"నీమాటలు మరీ విచిత్రంగా వుంటాయత్తా!"

"లేదే అమ్మాయ్, విచిత్రమూ లేదు, వింతా లేదు, నాకెంత తలబొప్పెలు కట్టకపోతే చెప్పా నంటావ్ ?

అన్నట్టు పురుడువెళ్లేదాకా యిక్కడే వుంటా వుగా! యీసారి కొడుకునెత్తుకుని వెదురువుకాస్లే అత్తారింటికి.

మా మొహానికి అటువంటిముద్దూ మురిపెమూ, లేకపోగా లోకంలో యీ యాగీయేమిటి చెప్పు! అంతా కాకిని పొడిచినట్టు పొడుస్తున్నారు గదా నన్ను! అందరూ కొడుకెందుకు లేచిపోయినాడని అడిగేవాళ్లేకదా! దీనిజాతకం చట్టుబండలై పోనూ, యేవేళ్ల అడుగుపెట్టిందో కానీ, వాడికి స్థానభ్రష్టం యేమిటి ఖర్మ—ఉన్నవూళ్లో వుండి యెంతమంది ఉద్యోగాలు చేసుకోటంలేదు ? వాడిడీ వొట్టి దేశ దిమ్మరి బతుకై పోయింది.

ఇల్లుకూడా బేరంపెడతానని అప్పుడేఅన్నాడు. ఇంటిపట్టున లేకుండా పోయినందుకే యేడుస్తుంటే... యీ బంగారుతల్లి మాకు వూరికే దొరికిందీ?...

యీ సోద్దెం చూశావా: పెళ్లికి మేం పెట్టిన అయిదువొందలూ తనదగ్గిరే అట్టి పెట్టుకుని యేవీ, చేయించకపోగా మొన్నను పుట్టింటికివెళ్లి నప్పుడు ఆ మెళ్లోవున్న గొలుసుకూడా తీసుకుని పంపించాడు. ఏమైందే అంటే యిది మాట్టాడదుగా మొద్దురాచ్చిప్ప —మూడు, ముండిదీపశ్మెమ్మాలాగా యెట్టా వుందో!"

"ఇలాగే వుంటాయత్తా, సంసారాలు, యెవరికి చెప్పి యేంలాభం ?"

"నేనూ అట్టాగే అనుకుంటానే అమ్మా, వూరికే కడుపులో దేవుతుంటే యెవరికీ చెప్పకుండా యెట్టా వుండగల్ను ?—కొస్త క్రిష్ణా రామా, అనుకుని నేను తిని ఆవిడకి పడెయ్యాలి. ఇంతసేపూ వుండనేవున్నావ్ గుప్పెడు మెతుకులు తినిపోవే అమ్మా! నువు కాసేపు కూచుని మాటా పలుకూ, ఆడుతుంటే నాకూ ప్రాణం లేచొచ్చినట్టుందే తల్లీ!"

"దానికేం లే! అత్తా, యివ్వాళ ఆయన వొస్తా నన్నారు"

"అలాగుంటే అయితే వెళ్లమ్మా, ఏపీఁ అనుకోక యెప్పుడో వోనాడు మాయింటో కూడా పట్టెడన్నం తినివెళ్లు! నీకో కొడుకుడితే ఇక్కడ వుండనేవుండవ్ ఏవో పూర్వకాలపు ఘటాలం కనక 'వాళ్లు రాలేదు వీళ్లు రాలే'దని ఆఘోరిస్తాం ఎవ్వరూ రారమ్మా, అత్త చెప్పినమాట మర్చిపోకేం ?"

"సరేలే అత్తా వెళ్లొస్తా"

"ఏ పొద్దుకూకు మాటునన్నా యిటు వొస్తూ వుండు, నేనే వొద్దామంటే...విన్నావుగా ? యీ కొంప యెవరిమొహాన పెడుతుందోనని భయమేనా యిరి! వొసేవ్ అమ్మాయ్. దాని శాణాతనం మాశావూ, పరాయిపిల్లవు యింతిసేపణ్ణించీ కూచుని మాట్లాడు తున్నావ్ కదా! యెవరో కనుక్కుని బొట్టుపెడదా మనయినా యివతలకు వొచ్చిందేమో. అదుగో:— ఆ గూట్లో కుంకంభరిణె వుందిగానీ బొట్టుపెట్టుకు వెళ్లమ్మా ?"

3

"...అందుకనే రా రామూ, మద్రాసులో వున్న ప్రతివాడికీ 'బీచికి' రావాలనే ఆరాటం- ఏమంటావ్ ?"

"..........................."

"ఆ ధ్యానమేవిట్రోయ్, 'సాగర సంగీతం' లాంటిదేదైనా సృష్టించడంలేదు కదా! యేదో కవిత్వం లోపల గుడగుడలాడుతున్నట్టే వుందే!"

"అబ్బ—నన్ను మాటాడించకురా భానూ, మనసులో చాలా చిరాగ్గా వుందిగానీ..."

"అదా వొచ్చిన తిప్పలు...అయినా యిన్నాళ్లనించీ లేనిదీ..."

"నీకు దణ్ణంపెడతాను చంపకురా బాబూ!"

"ఎంతమాటన్నావ్, శాంతం పాపం, ఏదో.... నీ చేతికిందేసుకుని నాకూ నెలకు పదిరాళ్లు ఇప్పిస్తున్నావ్ గదా, నిన్ను నేను చంపుకుంటాన్రా యెప్పుడైనా ? ఈ 'బీచి'లో నువ్వలా మాటా, పలుకూ లేకుండా స్తబ్బుగా కూచుంటే నాకేవీఁ తోచడంలేదు చావమంటావా ? మద్రాసు 'బీచి' అంటే బ్రహ్మదేవుడి మొట్టమొదటి సృష్టి అన్నమాట! లేకపోతే అటు చూడు, ఆ జంట లేవిఁటంటావ్ ? ఎక్కడ చూడబోయినా వీళ్లే ప్రత్యక్షం గదా! అరె! ఎంత చిత్రమాయెరా ప్రపంచము ?"

"నీకు కొన్నాళ్లకు పిచ్చెక్కుతుందిరోయ్."

"ఒకప్పుడు లేదు కనకనా ?"

"మ రే విఁ టీ వా గు డు, న న్ను విసిగించకంటుంటే ?"

"నువు చెప్పేదేవిఁటో తొందరగా చెబితే మళ్లీ మాటాడనుగా!"

"చెప్పేందుకేఁ వుంది ?"

"ఏవీఁలేదని నాదగ్గిర బుకాయిస్తావెందుకు? నీ మెదడులో యేదో కుమ్మరిపురుగు తొలుస్తోంది, అవునంటావా ?"

"దానిమాట యెలాగున్నా యిప్పుడు చెవులో జోరీగలాగు నువు తగుల్కున్నావ్"

"నువ్వొక్కడివే కాదు. మరెంతమందో అన్నారామాట. అయినా కూచున్నవాణ్ణి కవ్వించి, కసిరి కొట్టినా నవ్వించడమే భానూగాడి ప్రత్యేకత ఏమంటావ్ ?"

"నీ తలకాయంటాను"

"అంటే నాకేం ఫరవాలేదుగానీ, ఒక్క సంగతి అడుగుతాను దాచక నిజం చెప్తావా ? నీకు ఇంటి మీద గాలి తిరిగింది. అవునా ? కాదా ? నిజం చెబితే మళ్లీ మాటాడించను. నాబోటి బ్రహ్మచారిగాడికి అలాటి విషయాలు చెప్పినా తెలియడం కష్టమనుకుంటారు మీరంతా. ఈ సంసారాల్ని గురించిన మనస్టడీఅంతా యెవరికి తెలుస్తుంది ?"

"ఏవేఁం పుస్తకాలు చదివావేవిఁటి ?"

"అలా అడిగితే యెన్నైనా చెబుదును. నువు మూతి ముణుచుక్కూచుంటే నాకేవీఁ తోచేడవదురా భాయీ !"

"ఏం జెయ్యమంటావురా ?"

"చెప్పేది వినమంటాను. మన విజ్ఞానమంతా కొన్ని గ్రంథాలకే పరిమితమైలేదు. 'నేచర్ స్టడీ' అంటారు విన్నావా ? అదే మనకు ప్రాణాధారం. నువ్వు గమనించావో లేదో, కాని తీరికసమయాల్లో మన 'రూమ్, ప్రక్కనున్న' అరుగ్మగం చెట్టి సంసారాన్ని చూసి నేను సంపాదించుకున్న విజ్ఞానం అపారం. అటువంటివే మరికొన్ని సంసారాలు మనకు నేర్పింది చాలా వుందిలే. వో ఉద్గ్రంథం రాసిపారేస్తానేమో...నాకే తెలీకండావుంది"

"అదేదో రాసెయ్యరాదూ ?"

"అంత తొందరగా రాసిపారేస్తే యెలా ? ఇంకా చాలా ఎక్స్పీరియన్సు సంపాయించాలి!"

"నీ మొహం సంపాయిస్తావ్! పెళ్లంటే పదిమైళ్ల దూరానవుండే నీకు సంసారాన్ని గురించి యేమాత్రం ఎక్స్పీరియన్సు వస్తుందంటావ్ ?"

"అలా అనకు, నేను స్టడీచేసే తీరే వేరు. ఈ విషయంలో ముఖ్యంగా గమనించాల్సింది ఒకటుంది. సంసారాల ఆంతర్యం అవగతం చేసుకుని అవి మనుషుల మేథస్సులమీద యెలాటి ప్రభావం చూపుతున్నాయీ అని"

"మరి వాటి గుణదోషనిరూపణం అనావశ్యకమంటావా ?"

"గుణము, దోషము అనేవి ప్రతిదానిలోనూ వుండే సాధారణ విషయాలు. మనుషుల మనస్తత్వాలనుబట్టి వాటంతటఅవే అట్టే మారిపోతూవుంటాయ్. ఏవిఁటి ఆలోచిస్తున్నావ్, మన పేపర్ సర్క్యులేషన్ సంగతా ?"

"సర్కుల్యేషనూ లేదు, చట్టుబండలూ లేదు"

"మరేవిఁటి ?"

"అయిపోయిన పెళ్లికి బాజా. వాసు, ఉత్తరం రాశాడురా యివ్వాళ. ఆఫీసులో యేదోపని చేసు కుంటుంటే పోస్టుమేన్ వచ్చి యిచ్చిపోయాడు."

"అదా సంగతీ...ఎవరికీ చెప్పకుండా నే బీచికి వచ్చేశావే! ఏం రాశాడేవిఁటి ?"

"ఉన్న యధార్థమే రాసివుంటాడు. ఇదుగో, చదువు మరోసారి నేనూ వింటాను"

"సరే, అయితే యిలా ఇయ్యి...ఏదో పెద్దకథ రాసినట్టున్నాడేవిఁట్రా ?"

"చదువుదూ!"

"అయితే సావధానచిత్తుడవై ఆకర్ణింపుము!— 'రామూ! నువు యిక్కణ్ణించి వెళ్లిన నాలుగు నెల్లనించీ చాలా వుత్తరాలు రాసుకున్నాం, అవన్నీ మనయోగ క్షేమాలవరకే పరిమితమై వున్నయ్. ఆంతరంగిక విషయాల్లోకి యెవరూ చొరబడలేదు.

నీవిప్పుడు వ్రాయమనకపోయినా, నా అంతట నే నే వ్రాయసాహసిస్తున్నాను. విషయంసాకల్యంగా అర్థంచేసుకున్న తరవాత నన్ను ఏమన్నా పడడానికి సిద్ధమయేవున్నా—

ఒకమిత్రునిపట్ల మరొకడు నిర్వర్తించుకోవలసిన కర్తవ్యమే నన్నిలా వ్రాయమని ప్రేరేపిస్తోంది.

పద్మనాభంగారి కూతుర్నిగురించి నువ్వడిగి నప్పుడు నాకు తెలిసిన వాస్తవ విషయాలు చాలా చెప్పాననుకుంటాను. అవన్నీ జ్ఞాపకం వుంచుకునే నువు పెళ్లిచేసుకున్నావ్. అంతవరకూ నాకేమీ సందేహం లేదు.

తరువాతి పరిణామం యెలావుంటుందని వూహించుకున్నావో నాకు తెలీదు. నువ్వూ వ్రాయ లేదు. కాని కళ్లారా చూసిన యధార్థాన్ని వ్రాయడం నాపరమ కర్తవ్యమనుకుంటున్నాను.

నీవు చదువుకుని సత్వర నిర్ణయం చేసుకోలేక పోతే ప్రపంచం, నీ బలహీనతను పరిహసిస్తుంది; నీ వ్యక్తిత్వాన్ని వెక్కిరిస్తుంది. వోనాడు సాయంత్రం అయిదున్నరగంటలకి— నేను అప్పుడే ఆఫీసునించి యింటికివస్తున్నాను. మీ యింటిముందర పదిమందీ గుమిగూడి వుండడం దూరాన్నించి చూశాను. ఏమై వుంటుందా అని సందేహించాను. దారేపోయే వాళ్ల గుసగుసలవల్ల నాకు సగం విషయం అప్పుడే అర్థ మయింది. క్రమంగా దగ్గిరకి చేరుకున్నాను. ఆ రణ రంగంలో మీ అమ్మగారు వొకపక్షం. ఆమెకు మీమామగారు వొక్కడే ప్రతిద్వంద్వి. తక్కిన వాళ్ళంతా యీ వాగ్యుద్ధాన్ని చూసే ప్రేక్షకులే. వో మాట చెప్పడం మర్చాను. వారిద్దరికీ నడుమ నీ భార్య మౌనంగా నిల్చునివుంది.

ప్రస్తుతం వారిమధ్య నడిచిన తీవ్ర సంభాషణల ధోరణిని వేరేవిధంగా వ్రాయనవసరం లేదు. అలాటి సంభాషణ నాగరకత, విజ్ఞానం లేని యే, అనాది జాతులో పోట్లాడుకుంటున్నప్పుడు అరుదుగా విని వుంటాం.

కాస్త తలెత్తుకు తిరగనేర్చిన ప్రతివాడూ, సిగ్గుతో తలవంచుకున్నాడంటే అతిశయోక్తి కాదు.

నేమా సగంచచ్చే అక్కడ నిల్చున్నాను, ప్రత్యేకం నీకీ సమాచారాన్ని చేరవెయ్యాలనే వుద్దేశ్యంతో.

మధ్య మధ్య నీవిషయంలో విజృభించినప్పుడు నీ జీవితాన్ని వాళ్ళదృష్టితో వ్యాఖ్యానించినప్పుడు అవమానంతో తల వంచేసుకున్నాను.

నిజంగా నువు నట్టే చవటపెయ్యవేనా అని అందరూ సందేహించక పోలేదు.

అలాటి ఉద్రిక్త వాతావరణంలో యెవరికీ యేవిధంగానూ నచ్చచెప్పటానికి ప్రయత్నించలేక పోయాను.

నిజంగా నాకు భయం వేసింది.

చివరకు తేలిందేమిటంటే యీ సంబంధంచేసి తన బిడ్డకు నిలువునా గొంతుకోశానంటాడు ఆయన.

'మరో కళ్లయితే యింట్లోనించి బయటకు గెంటుతారు, లేకపోతే గరిటెకాలిచి వాతలుపెట్ట యినా పని చేయించుకుంటారు.' అంటుంది మీ అమ్మ గారు.

ఆఖరికి ఆయన ఇలా అన్నాడు. "పదవే అమ్మాయి, పోలీసుల్ని పిలిపించి వీళ్లతడాఖా యేవిఁటో కనుక్కుంటాను" అని.

వాళ్ల మనసులకు యెలాటి కష్టం కలిగితే నడి వీధిలో నుంచుని అలా అనుకోగలిగారు. యధార్థం యెవరికి తెలుస్తుంది ?

తరవాత యేం జరిగిందో నా కింతవరకూ తెలియదు. ఆయన కూతురి చెయిపట్టుకుని చరాల్న యింట్లోకి వెళిపోయాడు. మీ అమ్మగారు వాళ్ళ వెనకాలే వెళ్లింది శాపనార్థాలు పెడుతూ. మీ చెల్లెలూ, బావగారుకూడా మాతోపాటే చూస్తూ నిల్చున్నారు. ఎందుచేతనో వాళ్లతో మాటకుమాట కలపలేకపోయారు.

అంతటితో బైటజనం యెక్కడివాళ్లక్కడ జారుకున్నారు. నేనూ యింటివైపుకి సాగిపోయాను.

ఇదీ— నేను కళ్ళారా చూసిన సంఘటన. యధార్థం రాసినందుకు నువు కోపగించుకొన్నా నాకు సమ్మతమే. కాని భావినిగురించి బొత్తిగా ఆలోకుంచుకోలేకపోతే కుక్క నాకేసిన యెంగిలాకు కున్నవిలువైనా వుండదని జ్ఞాపకం వుంచుకో! ఇంత ఘాటుగా అన్నానని నన్ను తిట్టినాసరే— వాసు—, ఉత్తరం ముగిసిందిరా భాయీ!

"సరేగానీ, ఆలోచించగా నాకోటి తోచింది అడగనా ?"

"అడుగు !"

"మట్టికుండలో మాణిక్యంకోసం దేవుళ్ళాడడం —అది తెలివిగలపనే నంటావా ?"

"కాకపోవచ్చు, కాని, మాణిక్యం మట్టిలోనే పుడుతుందని తెలుసుకుని వుండడం మంచిదేమో ?"

"మట్టిని మట్టిగానే తెలుసుకున్నాక మూటగట్టుగో జూసేవాడెవడైనా వుంటాడూ ?"

"వుండొచ్చు, ఎందుకనంటే, అది కుమ్మరివాని చేతిలో పడితే కూజాగా తయారవుతుంది, చల్లనినీళ్లు తాగిస్తుంది. లేక అతడే వొక శిల్పి అయితే సజీవ ప్రతిమను కళాత్మకంగా సృష్టిస్తాడు. ఆయా వ్యక్తుల మానసిక అభీష్టాన్ని, నైపుణ్యాన్ని బట్టి మాణిక్యంకంటే మట్టినే విలువైన దానినిగా సృష్టించవచ్చు."

"అయితే యింక నీతో మాటాడను."

"ఎందు కని ?"

"రొండు రోజులు తీరిగ్గా ఆలోచించుకోవాలి !"

"అస లేవిటో నీ ఆందోళన నాకర్థం కావడం లేదురా బాబూ !"

"నువు అర్థం చేసుకునేతీరు వేరు. నా ఆలోచన మరొకటిగా వుం దిప్పుడు."

"చెప్పెయ్యరాదూ, ఒక్కమాటలో తేల్చేస్తాను."

"అందుకే కొంత గడువు కావాలంటున్నాను."

"అవసరమయితే అలాగే చేదాం, కాని, వృధా కాలయాపన చెయ్యడం నా కిష్టం లేదు."

"వోసారి త్రివిక్రమ రావుగారితో మాటాడాల్సిన అగత్యం వున్నట్టు తోస్తుంది. తరవాత సంగతి నీతో ఆలోచిస్తాను."

"త్రివిక్రమరావా ?.. సరే—అయితే అలాగే కానియ్యి! అయినా ఆ కోర్టుపక్షితో మన కేం పనిరా ? మన పేప ర్నెవరూ ధరావతు కట్టమని అడగ లేదు కదా !"

"అలాటివి నీకు తెలీకుండానే యెలా జరుగుతయ్‌రా ?"

"మరేవిటే నీ కాయనతో అవసరం ? 'లీగల్' గా మనం యేవిధంగానూ ప్రొసీడ్, అవాల్సిన అవసరం లేదే !"

"నువు పేపరు విషయంలో ఆలోస్తున్నావ్ నేను చెప్పేది నా స్వంతం."

"ఏంమీమావయ్యకూడా యేవన్నారాశాడా? వ్యవహారాలన్నీ నిన్నే చక్కబెట్టుకోమని."

"ఇంతవరకూ రాయలేదు, ఇక ముందేమౌతుందో...సరే, వెడదాం పద !"......

"వొరే రామూ ! నే నెన్నడూ యింతసీరియస్‌గా, నిన్ను నిలవేసి అడగలేదు, కాని, ఇప్పుడు అడుగుతున్నాను. వోక్షణం ఇలా కూచో, త్రివిక్రమ రావుతో నీకేం పని ?"

"తర్వాత చెప్తాలే! పదరా పోదాం, వోసారి ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరంకూడా వుంది"

"అన్ని పనులూ నేను చూసుకునే వొచ్చాను, రేపు మనం వెళ్లినా, వెళ్ళకపోయినా, ఇస్యూ, వొచ్చేస్తుంది. ముందు నీ మెదడు తొలిచే పురుగేవిటో పెరికి వెయ్యాలి! నాకో సందేహం తోస్తోందినీ ధోరణిచూస్తే. యధార్థంగా నువు ఆలోచించింది చెప్పు !"

"నన్ను చంపకురా, తల పగిలిపోతోంది"

"మరేం ఫరవాలేదు లే, చేతి రుమాలు గట్టిగా బిగించు!"

"ఎన్నడూ లేనిది యివాళ యింత వేపుకుతింటు న్నావేరా నన్ను?"

"దాని అవసరంవచ్చింది కనక - నువుమాట తప్పించి మసిపూసి మారేడు కాయ చెయ్యకు, అసలు విషయం దాచక చెప్పెయ్యి!"

"తప్పదంటావా ?"

"తప్పదు."

"చెబితే తిట్టకుండా వుంటావా ?"

"అవసరంవుంటే నిరభ్యంతరంగా తిట్టేస్తాను. అసలు నువు మనసులో అనుకున్న దేదో బయటపెట్టు!"

"సరే—చంపకు, చెపుతా విను!, నేను అడిగిన రెండు ప్రశ్నలకీ సమాధానం విని నాతో నువు ఏకీభవించవనుకున్నాను. నేను అనుకున్న దేమిటంటే ప్రపంచ జ్ఞానంలేని యీ పెళ్లాంతో కాపరం చెయ్యడం నరకతుల్యం, యెంత ప్రయత్నించినా యీ పరిస్థితి చక్కబడే విధానం తోచదు, తెలిసి వుండికూడా పైపూతలు పెడితే చివరికి అతుకుల బొంతగానే తయారవుతుంది. అందుకని ప్లీడరుతో సంప్రదించి విడాకులకు దావా వేద్దామని"

"ఇంతేనా!"

"ఇంతే—"

"అయితే నేను చెవుతాను విను! విశ్వనాథ అయ్యర్ కేసులో బాగా వాదించి 'శబాస్' అనిపించుకొన్నాడనేగా త్రివిక్రమరావును ప్రత్యేకంగా యెన్నుకోవడం? నీ కాయన్తో పోలికే లేదు. ఆ సంగతి తర్వాత చెప్తాను. ఆ మొన్నాడే మన పత్రికలో వ్రాసుకున్న వ్యాసం జ్ఞాపకంవుందా ?"

"లేకేమి ?"

"దానికి సమాధానం యేం చెవుతావ్ ?"

"చెప్పే దేవుంది? ఇది నా స్వంతవిషయం. అంతకంటె గత్యంతరమూ తోచలేదు, జీవితాంతం యీ చెర అనుభవించే సహనం యెవరికుంటుంది? ఏదో విధాన బయటపడి హాయిగా బతకాలంటే శరణ్యం యేదీ కనబడలేదు."

"అయితే యిప్పుడు ప్రపంచంముందర నిలబడి నీ వేమి సంజాయిషీ చెప్పుకోగలవు? వాసుకి ఏం సమాధానం రాస్తావు?"

"ప్రత్యేకంగా నేను వ్రాయ నవసరంలేదు. సంగతంతా వాళ్లే గ్రహించుకుంటారు."

"ఓరి పిరికిపందా! స్వార్థంకోసం జీవితంతోనా చెలగాటం? ఏ మారుమూలకు పోయినా నిన్ను నువు కప్పెట్టుకోలేవు తెలుసునా?"

"తెలుసు, అయినా నా వ్యక్తిగత విషయాలతో లోకానికి యేం సంబంధం ?"

"లోకానికి లేకపోవచ్చు, అది సాధ్యమైనంత వరకు వ్యక్తిలోని బలహీనతనే ఆధారంగా తీసుకుని అణచివేయ జూస్తుంది. కాని, నీ స్వంతంతో నాకూ కొంత సంబంధం వున్నదని వొప్పుకుంటావా ?"

"వుండొచ్చు."

"అందుకే చెబుతున్నాను, వాళ్లు మానవత్వాన్నే మరిచి నడివీధిలో కొట్లాడుకొంటుంటే ప్రక్కనజేరి కుక్కల్లా తోకాడించటం మన వంతు కాదు.

విశ్వనాథ అయ్యర్ చేసినతప్పు—అది తప్పేననే అభిప్రాయంతో—లోకంముందర నిరూపించడంలో అంత సాహసము, స్థైర్యము అవలంబించిన వాడవు నీ విషయం వొచ్చేసరికియే మురికిగుంటలోకో జారిపోవడమా? దోమలకు, ఈగలకున్న విలువకంటే యెక్కువ యేముంటుంది ?"

"ఆఁ...'మనుషుల విలువలు' అనే మాటకు అర్థం యేమిటి ?"

"అర్థం లేదని యిప్పుడు నువు బుకాయించగానే సరికాదు. జీవితంలో బాధ్యత అనేది యెరక్కుండా ప్రవర్తించిన గాలిబతుకుల వాళ్లని యెంత మందిని చూడడంలేదు ?

చేతులారా అన్నీ చేసుకుని చివరకు పశ్చాత్తాపం నటించే చచ్చురకం వేదాంతుల కోటిలోనే నువుకూడా చేరిపోతానంటావా ? అలాటిది వొక్క సినిమాల్లోను, నాటకాల్లోనే చెల్లుతుందిగాని, వాస్తవ జీవితంలో అడుగడుక్కీ చెప్పుదెబ్బలు తప్పవు.

ఆనాడు ఆ పెళ్లికి అంగీకరించకుండా నువు గంగలో దూకినా నీ వొక్కడి బతుకే నాశనమయ్యేది. ఇప్పుడు వొక అమాయిక ప్రాణికి కంఠానికి ఉరిపోసి అగాధంలోకి పడదోస్తూ అంచున నిల్చుని చప్పట్లు చరుస్తావా ?

ఆమెను అక్కడే దిగవిడిచి యిలాంటి అవకాశంకోసం బోయవాడిలా పొదమాటున పొంచివున్నావని, అసలు ఇలాంటి దురాలోచనతో నే నువ్వా పెళ్లికి వొప్పుకున్నావని, ఇప్పుడు తెల్లమవుతుంది లోకానికి !"

"నేను వొక్కమాట అన్నానని మరెన్నైనా వూహిస్తావురా నువ్వు !"

"ఈమాటకు వెనకాల యెన్నో పైశాచికశక్తులు పనిచెయ్యలేదంటావా ?"

"వాసు రాసిన ఉత్తరం చదువుకోగానే అవన్నీ నా బుర్రలో పుట్టినవే. నన్నెవ్వరూ మెడలు విరిచి యిలాటిది తలపెట్టమనలేదు.

పెళ్లిచేసుకునే నాటికి నాకిలాటి ఆలోచన లేదు. చెపితే నమ్ముతావో లేదో...

వొకవంక మద్రాసు వచ్చెయ్యాలనే ఆరాటం, మరోవంక మామయ్య బలవంతం, నాకేదో మైకం కమ్మినట్టయిపోయింది. విధిలేక సరే అన్నాను. ఆ నాలుగురోజులూ ముళ్లమీద నిల్చున్నట్టే గడిపి యిక్కడకు వచ్చేశాను. ఒక్కనాడైనా నే నా మొహం తేరి పారజూసి యెరగను.

ఇన్నాళ్లనించీ యిక్కడే. నీదగ్గిరే గడిపాను. కాని, నా సంసారం యిలా పరిణమించిందని తెలుసుకున్న మరుక్షణంనించీ యీ ఆలోచనే నా మెదడులో మంటలు రేపుతోంది. వాసుగాడి ఉత్తరం వో పర్వతం రెక్కలు కట్టుకొచ్చి నా నెత్తిన వాలిట్టుంది. ఏం జెయ్యమంటావ్ ?

నువు తిడుతుంటే వొకొక్కమాటే విషం పూసిన బాణంలా నా గుండెల్లో దిగుతోంది మర్మచ్ఛేదంగా. కాని, జీవితభారం వొదిలించుకునే వుపాయం తోచడంలేదు. ఇలా చేస్తే నిరపాయంగా బయటపడిపోగలననుకున్నాను, నువు తిట్టేస్తున్నావ్ ఏం జెయ్యినా?"

"అయితే నీ దృష్టిలో 'అపాయం' అంటే యెవడైనా యెదురుగావొచ్చి తల బద్దలుకొట్టడమేనా? కలసి మెలసి పెనవేసుకు బతకాల్సిన రెండు జీవితాలకు సంభవించే విఘాతం అపాయంగా జమకట్టావన్నమాట? జీవితం విలువలు తెల్సుకోలేని మూర్ఖతఅంటే ఇదే నంటాను."

"అవున్రా మరి, పేడబొమ్మకి యెన్ని పైపూతలు పెట్టినా ప్రయోజనం శూన్యమేగదా ! ఆంతర్యం తెలిసిన యెవడూ అలాటి పనికి సమకట్టి అపహాస్యంపాలు కాడనుకుంటాను."

"ప్రకృతిని అర్థం చేసుకోలేని వట్టి పేడ బతుకు నీది. కాని, యెవ్వరూ ప్రసాదించలేని జీవచైతన్యం వొకటి ఆ ప్రతిమలో తొణికిసలాడుతున్నంతవరకూ వెలలేని గులకరాయిలా విసిరి పారెయ్యడం యెవరితరమూ కాదు. అయినా నీ కంఠాన కట్టుకున్నప్పుడు అసలే సాధ్యంకాదు. చావో, బదుకో— బాధ్యత వహించక తప్పుతుందా ?

మక్కువతో ఆమె మొహమైనా చూడని నీవు ఇక్కడే వుండి విడాకులకోసం సంప్రదింపులు సాగిస్తే త్రివిక్రమరావు యెన్నడూ వొడ్డెక్కించలేడు. విడాకులంటే యెంగిలాకులు పెంట కుప్పమీద విసిరి పారేసినంత తేలికమాత్రం కాదు.

పట్టుమని పదిరోజులైనా కాపరం వెలిగించని నువ్వు అసలా పేరెత్తడానికే తగవు! అనుభవం లేకండా చిలకపలుకులు పలికినంత మాత్రాన చేతులు కాలడం తప్ప మరొకటి కాదు.

తెల్లారిలేస్తే ప్రతిదానికీ సైకాలజీ, అని అఘోరిస్తావుగా, యింతేనా నువు గ్రహించింది ?

మనుషుల మనస్తత్వం యెలా మారుతుందో గ్రహించుకోలేక మట్టి బెడ్డనుకొట్టినట్టు విసిరికొడదామనుకుంటే అది మున్ముందు నీకే బెడిసికొడుతుంది."

"నువ్వేదో గ్రంథం మొదలెట్టావ్ గానీ, నాకు బుర్ర వేడెక్కిపోయిందిరా! ఇప్పుడు యెవరేమి చెప్పినా వినే స్థితిలో నేను."

"ఏడిచావ్ గానీ, నే చెప్పేదంతా సాంతం విని, రేపటిమెయిల్లో యింటికి ప్రయాణంకట్టు !"

"ఈ పళాన నేను చస్తే యింటికి వెళ్లలేను."

"అందుకే నేను చెప్పేది సాంతం వినేడవమన్నాను.—'నీమామగారు చేసిన పెద్ద పొరపాటు

యేమిటంటే మీ యావిడకి సరియైన తర్ఫీయదుయివ్వకపోవడం—అవునంటావా ?"

"అంతేనా ?"

"అంతేనా ?—మహా భారతమంత వుంది. పెద్ద పిల్లలిద్దరూ స్వతహాగా తెలివైనవాళ్లు కనక వాళ్లవిషయంలో ఆయనకు అలాటి అవసరం పట్టలేదు. వాళ్లతోపాటే అనుకుని గాలికి వొదిలి వూరుకుంటే యీ తీరున తయారయింది నీ ధర్మపత్ని"

"వోరేయ్!..."

"ఇంక మాటాడకు !—వాళ్లిద్దరూ కాపరాలకి వెళ్లిం తర్వాత యింట్లో సావాసంగా పలకరించే వాళ్లుకూడా లేకపోయారు.

ఇష్టంవుంటే యే పసిపిల్లతో కొంతసేపు ఆడించేది. లేకపోతే యే మూలనో మూతి ముడుచుకూర్చునేది.

తల్లివొట్టి వెర్రి బాగులతల్లి అవటంవల్ల ఆమె నుంచి బిడ్డలకు యెలాటి విజ్ఞానమూ సంక్రమించే అవకాశం బొత్తుగా లేదు"

"నాకు తెలియనివన్నీ కూడా యేకరువు పెడుతున్నావురా ?"

"నీ మొహం—నీకేం తెలుసనీ అసలు? అయినా ఫరవా లేదు లే, ఘోషా కియే విన్నమైన భంగమూ రానివ్వను. తండ్రి యెప్పుడూ పైబ తిరిగేవాడే కనక వేళకి అన్నము, వ్యవహారాలూ తప్ప మిగతా యింటి గృహ విషయాల్లో ఆయన అంతగా జోక్యం పెట్టుకోడు, పెద్దన్నయ్య యిక్కడ వుండడుకదా ? ఇదీ అసలు పరిస్థితి. అందువల్ల రాను రాను, సూక్ష్మంగా మొనదేలవలసిన బుద్ధి మొద్దుబారి వూరుకుంది. అసలు అంతంత మాత్రమే అనుకో.

తల్లితోనైనా యిష్టం వుంటే మాటాడ్డం, లేకుంటే గోడకి యాలికిలబడి శూన్యంలోకి దిగాలుగా చూస్తూ కూర్చోవడం.

ఇంక నలుగురిలోకీ రావడమన్నా, నలుగురూ మాటాడుకుంటుంటే మాటకుమాట కలపడమన్నా తగని భయం. ఏ పేరంటానికైనా వెళ్లవలసి వొస్తే అమ్మకొంగు పుచ్చుకునే వెడుతుంది. వెంటనే తిరిగి వచ్చేస్తుంది.

ఇన్నాళ్లూ ఇలా గడిచిందిరా భాయీ !

ఎరిగున్న వాళ్లందరికీ యీ పిల్లవిషయమే పెద్ద సమస్య అయిపోయింది. తెలివితక్కువదని కొందరు. అసలు చెబితే తెలియనే తెలియదని మరికొందరు. వాళ్లవాళ్ల తెలివితేటలుకొద్దీ వూహించుకోసాగారు. గుసగుసలు ప్రారంభించారు. ఈ సంగతి పద్మనాభంగారివరకూ పాకింది. ఆయన వోసారి వెనక్కి తిరిగి చూసుకున్నాడు. అంతా ఆకళింపుకు తెచ్చుకున్నాడు, అన్నం పాసిపోకుండానే ముందుగా జాగ్రత్త వహించాలనుకున్నాడు. సరాసరి మేనమామగారింటికి బయల్దేరాడు. అప్పటికే యీ సంగతి వాళ్లవరకూ వెళ్లింది. వాళ్లు ససేమిరా, మీసంబంధం వొద్దన్నారు. కొద్దిగా బలవంతం చేశాడు. బెదిరించాడు. మరోసారి 'వొద్దనివాళ్లు రిజష్టరీ ఉత్తరం రాశారు. తరవాత మీ మామయ్యతో మాటాడాడు, కట్నం పెంచాడు. అంతా యీ తీరున జరిగిపోయింది."

"అయిపోయినట్టేనా ?"

"ఉండరా: ఇప్పుడు మన వొంతొచ్చింది. ఇలాటి పరిస్థితిలో తీసుకొచ్చి మీ యమ్మగారితో వొదిల్తే యెలా కుదటబడుతుంది సంసారం ?

చెప్పినమాటవిని, విన్నట్టు చేసుకుపోయే తెలివితేటలు స్వతహాగా లేనప్పుడు, ఆవిడముసలి మనసు శాంతం వహించి యెలా బ్రతిమాలుకుని చేయించుకోగలదు ? దానికి మారుగా మరింత రెచ్చిపోయింది. ఈ మౌనాన్ని వేరువిధంగా అర్థం చేసుకున్నది. ఇక్కడికివచ్చినా ఆమెకు అదే పరిస్థితి యెదురైంది. ఏకాంతంలో యేదో మౌనం—

ఇలాటి మానసిక మాంద్యం నశించి నూతనోత్తేజం పుట్టుకురావాలంటే ముందుగా పరిసరాల మార్పువొకటి అత్యంతావశ్యకం. పరిసరాలు మనుషుల మనసులమీద యెలాటి ప్రభావాన్ని చూపిస్తవో చెప్పతరం కాదు.

మనం కావాలనుకున్న అద్భుత పరివర్తనాన్ని అవి మాత్రమే తీసుకురాగలవు, తరవాత అద్దంలో ప్రతిబింబంలాగ ప్రపంచమంతా వొక్కసారి మనసులో మెదులుతుంది.

కాగా, ఇప్పుడు మన ముఖ్య కర్తవ్యం యేమిటంటే ఆమెను అక్కణ్ణించి మద్రాసు తీసుకురావడమే"

"చావుకబురు చల్లగా బైట పెట్టావ్, తనుదూర కంతలేదు గానీ, మెడకోడోలు !"

"విను విను ! అంటే యిక్కడికి తీసుకువచ్చి సంసారం వెలిగించమని కాదు ;"

"మరేవిఁటి నీ సలహా ?"

"అదే చెప్పబోతున్నాను. ఆమెను ఏదైనా ఒక సమాజంలో, పదిమందీ మెదిలేచోట, పలు విధాలుగా ప్రపంచపరిస్థితులు తెల్సుకోవడానికి అవకాశం వున్నచోట, ఒంటరిగా వొదిలిపెట్టాలి"

"నీ సైకాలజీ, ఏడిసినట్టేవుంది. గట్టున పడవేసిన చేపలాగవుతుంది"

"అలా యెన్నటికీ కాదు. గట్టున కూచున్నంత సేపూ నీటినిచూసి భయపడుతూనే వుంటారు. వాళ్లనే కంఠంలోతు నీళ్లలో వొదిల్తే పైకి తేలడానికి ప్రయత్నిస్తారు. అదే ఈత—ఇది ఒక శాస్త్రమే.

ఇప్పుడు నువ్వూ అలాగే చెయ్యి ! సంఘంలో మనుషుల విలువలు యెలా పెంపొందుతాయో గ్రహిస్తావ్! ఆనాడు ఈ 'బీచి'లో చెట్టాపట్టాలు పట్టుకు తిరిగేవాళ్లను చూస్తే అసూయపుట్టదు. శానూగాడి మాటకు యెంత విలువున్నదో తెలుస్తుంది. సంసారం మూడు పువ్వులు ఆరు కాయలు...

"ఇదా నీ సలహా?"

"మరేవిఁ టనుకున్నావ్ ?"

"సాగుతుం దంటావా ?"

"చక్కగా సాగుతుంది. పెళ్లంటే మరేవిఁటి ? పెళ్ళాం మాట వినకపోతే ప్లీడరుతో సంప్రదించి విడాకు లివ్వడ మనుకున్నావా? నన్ను పదిమైళ్లకు సెట్టేశావే, నువ్వెంతదూరానికి పోతున్నావో ఆలోచించుకో! ఎక్కాక్ ఎక్స్‌ప్రెస్, ఢిల్లీదాకా పోతావంతే. త్వరగా జాగ్రత్తపడు !"

"నాకేం పాలుపోవడం లేదురా !"

"పాలూ లేదు, పెరుగూ లేదు. వెళ్లాల్సిందే, తీసుకురావాల్సిందే;—అదంతే— వొరే అబ్బాయి ఎవరిమీదా, ఏవిధంగానూ నోరుచేసుకున్నావా, వాసు రాసినట్టు వొట్టి చవటవే అన్నమాట. నీ చాతకాని తనాన్ని వుపయోగించుకుని వాళ్లు యెన్ని కథలైనా అల్లుకుంటారు."

"మరేం జెయ్యమంటావ్ ?"

"గుట్టు చప్పుడుకాకుండా సుబ్బరంగా బండీ యెక్కి రైల్లోవొచ్చి వాలమంటాను. మద్రాస్ సెంట్రల్‌లో నేను స్వాగతం పలుకుతాలే ! మరొక్కమాట. రాత్రేవెళ్లి పొద్దున్నే నూకొక్కద్దా మనుకుంటున్నావ్ కామాలు. నాలుగైదు రోజులు అక్కడే వుండిపోవాలి తెలుసా ?...గుడ్లు మిటకరిస్తావేం? అక్కడ వుండాల్సిందే—"

"నాలుగురోజులు కాదుగదా, నాలుగు గంటలైనా అక్కడ వుండగల్నా ? వాళ్లమధ్య. అయినా అక్కడెందుకు? 'డర్టీ ఫెలోస్'—"

"అయితే నువు ఫేలయావన్న మాటే." కానీకి కొఱగాకుండా పోతావ్, అక్కడవుండి అసలు పరిస్థితి అర్థంచేసుకోవాలి.

మీ అమ్మకులాగా నీకూ్కడా రేచిక్కపుట్టుకొస్తుందనుకో. అప్పుడు తమాయించుకోవాలి తొణక్కుండా, బెణక్కుండా నిండుకుండలా నిలబడి చూస్తుండాలి.

నువు ఇంట్లో వున్నప్పుడు ఆమె ప్రవర్తన యెలాగుంటుందో జాగ్రత్తగా గమనించు ! ఏదో వొకప్పుడు అవ్యక్తిమీద జాలి కలుగుతుందేమో... ఆ సమయంకోసం వేచివుండు! అప్పటి నీ మనస్తత్వాన్ని, ఉన్నదున్నట్టు చిత్రించుకో."

"కబుర్లు దంచడం కాదు గానీ, అంతశాంతం యెవరికే డుస్తుందంటావ్ ?"

"శాంతంగా సాగిపోగలననే ఆత్మ విశ్వాసమే లేకపోతే, పెళ్లిచేసుకోడమే వ్యర్థమంటాను. ఇంత సున్నితమైన విషయాన్ని అర్థంచేసుకున్నా ఆచరణలో పెట్టుకోవడం - అదంత తేలికైన పనికాదు"

"పాఠాలు వల్లించినంత తేలిక అంతకంటే కాదేమో ?"

"నీకు మొదటనే చెప్పాను. నేను పాఠాలు చదవలేదు, పారిపోయే వాళ్లను చూసి నేర్చుకున్నానని.

పెళ్లాంతో పోట్లాడి అప్పుడే ఆతురసన్యాసం తీసుకుని కడుపుకాల్చుకుంటూ లేచొచ్చిన పెద్దమనిషి వొకడు మధ్యాహ్నం హోటల్లో తారసిల్లాడు

ఈపూటకు ఇక్కడతిన్నా, సాయంత్రం ఆఫీసునించి ఇంటికి యెలాచేరుకోవాలా అని ఆయనపడే ఆవేదన అంతా యింతా కాదు."

"అలా యెందుకు వచ్చాడో అడక్క-పోయావ్ ?"

"వొదిలిపెట్టాననుకున్నావా ? ఈ ఇన్‌ఫర్మేషన్, కోసం నరసింహంతో వాడి ఆఫీసుదాకా నడిచి వెళ్లాను వాడూ ఆ యింట్లోనే మేడపై 'రూమ్' లో వుంటున్నాడు.

అసలు సంగతి యేమిటంటే, ఆయనగారికి అన్నం తిని లేవగానే వేయించిన కందిపప్పుతినే అలవాటుంది. అక్కడా అక్కడా తిరిగి ఇంటికి రాగానే ఆవిడ అడిగిందట, 'కందిపప్పు తెచ్చుకోలేదేం ?' అని.

నరసింహం వింటూనే వున్నాట్ట, పైమెట్టు మీరినించి.

"బొత్తిగా అవజేశావేవిఁటే ?' అని ఆయన గద్దించి అడిగాడు—

'తింటూంటే అయిపోయ్యూ, నేను రాత్రే చెప్పాగా, అన్నదావిడ.

'అంత అడుగు దులిపేసుకునేదాకా చెప్పేడవ పోతే నాకెలా తెలుస్తుంది? ఎన్నాళ్లు కాపరం వెలగబెట్టినా వొక తేటీరు. అయినా ఈకొంపలో అన్నం తినడం నాదే బుద్ధితక్కువ, అంటూ ఉత్తరీయం బుజాన వేసుకుని అదేపోక.

'పోనీలెండి, ఈ పూటకి యెక్కడన్నా బదులు తెస్తాను. అన్న ఆవిడమాటలు వినిపించుకోనేలేదు. ఆ విసురులో హోటల్లో కొలిచిపెట్టిన కూటితో కడుపునిండక పక్కకొచ్చి పదణాల టిఫిన్ వేశాడు, నకనకలాడుతూ యింటికిపోతున్నాడు ఇప్పుడే. ఎంత ఆదుర్దాగా వెడుతున్నాడంటే, వ్రాస్తూన్న పెన్ను జేబులో ఆపళానే బోర్లించుకున్నాడు, చొక్కా అంతా సిరాతో తడిసిపోతున్నా ఆయనకు అంతుపట్టటంలేదు.

ఆ మనస్తత్వం యేవిఁటో నాబోటి వాళ్లకు వొపట్టాన తెలియదులే. అందుకే అన్నాను, 'ఆవ్యక్తిమీద 'జాలి, కలిగేవరకూ వేచివుండమని' అప్పుడు మనసు గుండెలలోతులు తాకి యథార్థంవిచారిస్తుందేమో...

"అనురాగపు లోతులు" తీసుకోవాలనే ఆ కాంక్ష వ్యక్తికి యెందుకు కలుగుతుందో, జీవన ప్రవంతి తన అనంత పథంలో ఒడుదుడుకులతో—

ఎత్తుపల్లాలు గడుచుకుంటూ యెందుకిలా ముందుకు సాగిపోతున్నదో ఆనాడే—

అర్థమవుతుందను కుంటాను. బ్రదుకు బాటలో
వొకొక్కచోట సేదతీర్చే చలువపందిళ్లే
కాక, అంతులేని యెడారులు,
ఇసుక తుపానులు కూడా
యెదు రౌతయ్యాని నీ
అంతటనువ్వే తెలు
సుకోగలవు !"

